క్లుప్తంగా

నేడు బీఆర్ అంబేడ్కర్ జయంతి

చీరాల: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక ముక్కోణం పార్కు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పట్టణ, రూరల్ అధ్యక్షుడు, పార్టీ నాయకులంతా పాల్గొనాలని కోరారు.

ప్రపంచం మెచ్చిన వ్యక్తి అంబేడ్కర్

ఇంకొల్లు(చినగంజాం): ప్రపంచం మెచ్చిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆయన లేని భారత దేశం ఊహించుకోలేనిదని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు అన్నారు. ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామంలో ఆదివారం నూతన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత భారీ ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ అంబేడ్కర్ చూపిన మార్గంలోనే నడవాలని సూచించారు. అంబేడ్కర్‌పై గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చార్వాక, సామాజిక కార్యకర్త పులిపాటి రవి, దళిత నాయకులు నలతోటి సుధాకర్, గాలి రమేష్, నలతోటి భానుప్రసాద్, బేతాళ పిచ్చయ్య, మేరుగ ఇలియాజర్, వైకుంఠ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటలకు ఆటంకం!


క్రీడామైదానంలో చెత్తకుప్పలను తగులబెట్టిన దృశ్యం


ఓపెన్ జిమ్ పక్కన చెత్తకుప్పలు

- అధ్వానంగా చీరాల హైస్కూలు క్రీడామైదానం
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- చెత్త కుప్పలను మైదానంలోనే తగులబెడుతున్న వైనం
- పొగపీల్చలేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, క్రీడాకారులు

చీరాల రూరల్: ఎస్ఆర్అండ్‌పీ మున్సిపల్ (చీరాల) హైస్కూలు క్రీడామైదానం అపరిశుభ్రతలకు నిలయంగా మారింది. ఈ హైస్కూలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. చీరాల పట్టణం నడిబొడ్డున ఎంతో సువిశాల ప్రదేశంలో నిర్మితమైన దీనిని చీరాల హైస్కూలుగా అంతా ప్రేమగా పిలుచుకుంటారు. గత కొంతకాలంగా హైస్కూలు పరిసరాలు చెత్తా చెదారంతో నిండుకుని అపరిశుభ్రతలో కొట్టుమిట్టాడుతోంది. విద్యనభ్యసించేందుకు వందల సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. స్కూలు ముగిసిన తర్వాత సాయంత్రం సమయంలో విద్యార్థులు పలు రకాల ఆటలాడుకుంటుంటారు. అంతేకాక ఉదయం , సాయంత్రం వేళల్లో క్రీడాకారులు, వాకర్‌లు ఈ క్రీడామైదానంలో వ్యాయామాలు, వాకింగ్ చేసుకుంటారు. హైస్కూలు మైదానం చుట్టూ పచ్చని చెట్లు ఉన్నాయి. అయితే చెట్ల ఆకులతో పాటు రోజువారీ చెత్తాచెదారాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. అధిక మొత్తంలో చెత్త పేరుకుపోయిన సందర్భాల్లో క్రీడామైదానం తూర్పువైపున చెత్తకుప్పలకు నిప్పు పెట్టి తగలబెబెడుతున్నారు. ఆ పొగ పీల్చలేక అటు విద్యార్థులు, ఇటు క్రీడాకారులు, వాకర్‌లు ఇబ్బందులు పడుతున్నారు. అలానే పురుషుల ఓపెన్ జిమ్ పక్కనే గతకొంతకాలంగా చెత్త కుప్పలు పేరుకుపోవడంతో పాములకు ఆవాసంగా మారిపోయింది. ఇటీవల ఓ యువకుడు జిమ్ చేస్తుండగా పాము చెత్తకుప్పల్లోకి వెళ్లడం చూసి నివ్వెరపోయాడు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు క్రీడాకారులు వాలీబాల్ ఆడుతుంటారు. అనేకమంది వాకర్లు వాకింగ్ చేస్తుంటారు. వాకింగ్ చేస్తున్న కొంతమంది వాకర్లకు పాములు సంచరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఏదైనా ప్రమాదం జరగక ముందుగానే స్పందించి పేరుకుపోయిన చెత్త కుప్పలను మున్సిపల్ కార్మికులతో తొలగించాలని అంతా కోరుతున్నారు. ప్రస్తుతం ఒంటిపూట బడులు నడుస్తున్నాయి.. ఎండాకాలం శెలవులు వస్తే హైస్కూలు క్రీడామైదానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి నెలకొంటుంది. విద్యార్థులు, క్రీడాకారులు ఆటలాడుతూ మైదానంలోనే అధిక సమయం గడుపుతారు. ఎంతో ప్రాముఖ్యమున్న ఈ క్రీడామైదానాన్ని అధికారులు పట్టించుకొని పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది.

అధికారులు పట్టించుకోవాలి

హైస్కూలు క్రీడామైదానం ఎంతో ప్రాముఖ్యమైంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో విద్యార్థులు, వాకర్లు, క్రీడాకారులు మైదానంలో వాకింగ్.. వ్యాయామాలు చేస్తుంటారు. మైదానంలోని పరిసరాలు చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. చెత్తకుప్పలు పెరినప్పుడు అక్కడే నిప్పుపెట్టి తగులబెడుతున్నారు. దానినుండి వచ్చేపొగను పీల్చలేక అంతా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి హైస్కూలు క్రీడామైదానం పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలి.

– పోలుదాసు రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

సేవలకు పురస్కారాలు


దేవరాజును సత్కరిస్తున్న దృశ్యం

చీరాల: కృతి ఫౌండేషన్ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కృతి ఫౌండేషన్ అధినేత అశ్విని ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి పురస్కారాలను ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ యువనాయకులు ఎం.అమర్నాథ్, జమ్మలమడక నాగమణి, పశుసంవర్థక శాఖ జేడీ బేబీరాణి, చిన్నగంజాం తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు, మెరైన్ సీఐ ఎస్.సాంబశివరావు, డాక్టర్ అమృతపాణి, గౌరవాధ్యక్షుడు ఆకురాతి వెంకట వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య, సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీకామాక్షి కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి.దేవరాజుకు డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం జాతీయ సేవా రత్న అవార్డుతో సత్కరించారు. కృతి ఫౌండేషన్ సభ్యులు, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలోని వివిధ సేవా రంగాల్లో ఉన్న ప్రముఖులకు అవార్డులను అందించారు.

గ్రామ దేవతకు నైవేద్యాల సమర్పణ


కారంచేడులో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు, ఆడపడుచులు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గ్రామ దేవత గంగమ్మ తల్లికి గ్రామస్తులు, భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున నైవేద్యాలు సమర్పించారు. గ్రామదేవత గంగమ్మ తల్లికి ఎంతో ప్రీతికరమైన రోజు ఆదివారం గ్రామానికి చెందిన భక్తులు, ఆడపడుచులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కుబడలు తీర్చుకున్నారు. గత నెల నుంచి ప్రతి ఆదివారం అమ్మవారికి పిల్లల పరీక్షల్లో మంచి విజయాలను కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం వచ్చిన ఇంటర్ పరీక్షల్లో గ్రామానికి చెందిన అనేక మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.

కాంప్లెక్స్ ఎరువులకు దీటుగా పీఎండీఎస్ కిట్లు


ద్రోణాదులలో రైతులకు కిట్లను పంపిణీ చేస్తున్న వాణిశ్రీ, అధికారులు

మార్టూరు: ముందస్తు ప్రణాళికతో రైతులు ప్రకృతి సేద్య పద్ధతులను అవలంబించటం ద్వారా కాంప్లెక్స్ ఎరువులకు ప్రత్యామ్నాయంగా పీఎండీఎస్ కిట్లను వినియోగించి భూములను ఎక్కువ సారవంతం చేసుకోవచ్చని నాచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ అన్నారు. మండలంలోని ద్రోణాదుల రైతులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 20 రకాల విత్తనాల మొక్కలను భూమిలో కలియ దున్నటం వలన పచ్చి రొట్టె ఎరువుగా తయారవుతుందన్నారు. అడిషనల్ డీపీఎం మోహన్, శశికళ, వెంకటేశ్వరమ్మ, తిరుపతమ్మ, అనూష, రాజేశ్వరి, మల్లేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం


కల్యాణ మండపంపై ఉత్సవ విగ్రహాలకు కల్యాణం


అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయ కార్యానిర్వాహణాధికారి శిరీషా పర్యవేక్షణలో అర్చకులు ఐనవోలు వెంకట శోభనా చార్యులచే ఆలయంలోని స్వామి అమ్మవార్లను పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయానికి దిగువ భాగంలోని కల్యాణమందిరం పై స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు మేళతాళాల మధ్య కల్యాణోత్సవం తంతు నిర్వహించారు.


దేశాయిపేటలో మట్టలకు పూలు అలంకరించి పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


యద్దనపూడిలో ఈత మట్టలతో విజయకేతనం చూపిస్తున్న క్రైస్తవులు

పూలు శాంతికి చిహ్నాలు

- ఘనంగా మట్టల ఆదివారం

వేటపాలెం: శాంతికి చిహ్నాలు పూలు అని క్రీస్తు పేర్కొన్నారని పాస్టర్లు తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక చర్చి పాస్టర్ తమ సందేశంలో రాజులు రాజ్యాలను చేజిక్కించు కునేందుకు యుద్ధాలు చేస్తుంటారన్నారు. అయితే యేసు క్రీస్తు మాత్రం శాంతికి చిహ్నాలైన పూలు, మట్టలు చేతిలో ఉంచుకొని విజయోత్సాహంతో ఎరుషలేము ప్రవేశం చేస్తారని చెప్పారు. మట్టలను రకరకాల పూలతో అందంగా అలంకరించిన చిన్నారులు నవీధుల్లో నినాదాలు చేస్తూ దేవుని గీతాలను భక్తి శ్రద్ధలతో ఆలపించారు. అనంతరం మట్టలకు అందంగా పూలు అలంకరించిన చిన్నారులకు బహుమతులను అందజేశారు.

అద్దంకి: పట్టణంలోని గరటయ్య కాలనీలోని బిలీవర్స్ ఈస్ట్రన్ చర్చిలో ఫాదర్ ఏ. కాంతారావు ఆధ్వర్యంలో పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు శుక్రవారం సిలువ వేయబడి, సమాధి చేయడి, మూడో దినం ఆదివారం తిరిగి లేచాడని చెప్పారు. ఆ విజయానికి గుర్తుగా ఈ పండగను జరుపుకుంటారని చెప్పారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇస్టర్ కరుణ జ్యోతి, పాస్టర్ రతన్ పాల్ ఇశ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే ఈస్టర్ పండుగకు ముందు వచ్చే మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సంఘకాపరులు చిన్నారులు ఈత మట్టలను పూలతో అలంకరించి భక్తిగీతాలు ఆలపిస్తూ, హోసన్నా జయం ..రాజుల రాజుకే జయం .. క్రీస్తు రాజుకే జయం అంటూ వాడవాడలా శాంతిర్యాలీ నిర్వహించారు. యద్దనపూడిలోని ఎపిఫానియా లూథరన్ చర్చిలో రెవరెండ్ రిచర్ట్స్ పచ్చ ఆధ్వర్యంలో పూనూరులోని ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బొంతు రాజేష్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసుప్రభు, యెరూషలేమ్ పట్టణంలో ప్ర ప్రథమంగా ప్రవేశించినప్పుడు అక్కడ ప్రజలు కీస్తును గాడిదమీద ఊరేగిస్తూ పెద్ద ఎత్తున స్వాగతం పలికారని దీనినే క్రైస్తవ విశ్వాసులు మట్టల పండుగగా ఆచరిస్తారని దైవ జనులు తెలిపారు.

కారంచేడు: క్రీస్తు ఈలోకంలో పాపులను రక్షించడానికి వచ్చాడని, ఆయనను ఎదుర్కొనడానికి అంజూరపు మట్టలతో జయము జయము ఇశ్రాయేలు రాజా అని కేకలు వేశారని, దీనికి సాదృశ్యంగా ఈ ఆదివారం మట్టల ఆదివారం నిర్వహిస్తున్నామని చర్చి ఫాదర్ విజయ్ సందీప్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఏసుక్రీస్తు ఉపవాస దినాల్లో జరిగిన కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలోని అన్ని ప్రధాన వీదుల్లో ఫాదర్స్, క్రైస్తవులు, విశ్వాసులతో కలసి మట్టల ఆదివారపు ర్యాలీని నిర్వహించారు. ఏసుక్రీస్తు కీర్తనలతో చిన్నారులు, పెద్దలు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఫాదర్ తంబీ, నాగులపాలెం విచారణ గురువు ఫాదర్ తంబీ జోసఫ్, ఫాదర్ షేక్ ఇగ్నీషియస్‌లు దివ్య బలిపూజలు నిర్వహించారు.

చీరాల రూరల్ : పట్టణంలోని క్రైస్తవ సంఘాలకు చెందిన పాస్టర్లు సండే స్కూలు చిన్నారులతో రకరకాల పూలతో అలంకరిచిన ఈత మట్టలు చేతపట్టించి పట్టణంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ (పెద్దచర్చి) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రెవరెండ్ పిల్లి దేవదాసు, అడిషనల్ పాస్టర్ రెవరెండ్ నానిబాబులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూతనంగా బాప్తిస్మం పొందిన విశ్వాసులకు క్రైస్తవ కీర్తనలు, బైబిల్ గ్రంథాలను అందించారు. అనంతరం సాయంత్రం సండేస్కూలు చిన్నారులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దావీదు కుమారునికి జయము, జయము ప్రభువు పేరిటవచ్చు ఇశ్రాయేలు రాజు ప్రభువైన ఏసుక్రీస్తంటూ నినాదాలు చేశారు. చర్చి చైర్మన్ దేటా అశోక్‌కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, పీసీసీ, ఎల్‌సీసీ, సంఘుస్తులు పాల్గొన్నారు. అలానే పట్టణంలోని విఠల్‌నగర్‌లోని మన్నా ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో రెవరెండ్ జాలా రాజేష్ ఆధ్వర్యంలో మట్టలాదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టంలోని పలు వీధుల్లో చిన్నారులతో ఈతమట్టలు చేతపట్టించి ర్యాలీ నిర్వహించారు. అలానే జాన్‌పేట, ఉజిలిపేట, పేరాల, శాంతినగర్, ఐక్యనగర్, హారిస్‌పేట, హయ్యర్‌పేట, థామస్‌పేట, సాల్మన్‌సెంటర్, బేర్‌పేట చర్చిలో మట్టలాదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నేడు ప్రతిష్ఠా మహోత్సవాలు


బల్లికురవలో ప్రతిష్ఠకు సిద్ధమైన మందిరం

బల్లికురవ: గ్రామస్తుల సమష్టికృషితో బల్లికురవలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి మందిరంలో సోమవారం ఉదయం 11.20 గంటలకు శంఖు, నామం, చక్రం, పాద ప్రతిష్ఠామహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ ఆదివారం తెలిపింది. స్థానిక పోలేరమ్మ ఆలయానికి దక్షిణ భాగంలో సుమారు 10 లక్షల అంచనాలతో మార్చి పదో తేదీ మందిర నిర్మాణానికి భూమి పూజతో పనులకు శ్రీకారం చుట్టిన అనంతరం పనులు పూర్తయ్యాయి. ఆదివారం సాయంత్రం ప్రతిష్ఠించే విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి మేళతాళాలు డప్పువాయిద్యాలతో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం జలాధివాసంలో ఉంచారు. లంక వెంకట రామ నాగ అమరకుమార్ బృందంచే వేదమంత్రోచ్ఛరణతో ప్రతిష్ఠా కార్యక్రమాలు జరగనున్నాయి. గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నాలని కమిటీ వారు కోరుతున్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం


పూసపాడు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు


బల్లికురవలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పూసపాడు ఎస్‌కేపీవీఎస్ హైస్కూల్‌లో 2006-2007లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 18 సంవత్సరాలు తరువాత పాత స్నేహితులు ఒకే వేదికపై కలుసుకున్నారు. చాలా కాలం తరువాత పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో పాఠశాల ఆవరణ అంతా ఎంతో కోలాహలంగా మారింది. గురువులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జీఎల్‌కే ప్రసాద్, హెచ్‌ఎం కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ: పూర్వ విద్యార్థులు ఆదివారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో ఒక్కటయ్యారు. 1977–80 సంవత్సరాల మధ్య 8,9,10 తరగతులు చదువుకున్న బ్యాచ్‌లో 38 మందిలో ఆరుగురు ఇటీవల కాలంలో అకాల మరణం చెందారు. కాగా మిగిలిన వారంత ఒక్కటై ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారంతా యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇంటూరి శివశంకరరావు దంపతులను దుశ్శాలువాలతో సత్కరించారు. పూర్వవిద్యార్థి గుంటుపల్లి రాంబాబు రూ. 30 లక్షలతో తల్లిదండ్రుల పేరుతో కళావేదిక నిర్మించగా.. అక్కడే సమ్మేళం నిర్వహించారు. తమ వంతుగా పాఠశాలకు సుమారు రూ. 50 వేల విలువైన ఇన్వర్టర్‌ను హెచ్‌ఎం కె. హనుమంతరావుకు అందజేశారు. గుంటుపల్లి మురళీమోహన్, చెరుకూరి నాగేశ్వరరావు, జి. మునిస్వామి, డి. సుబ్బారావు, చటర్జీ, పావులూరి ఆంజనేయులు ప్రధాన కర్తలుగా వ్యవహరించారు.

అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

చీరాల: అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని ఆదివారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ ఆదేశాల మేరకు ఎస్సై బి.శ్రీహరి, సిబ్బంది ఆదివారం వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలోని పెట్రోలు బంకు వద్ద వేటపాలెం సర్వోదయ కాలనీకి చెందిన షేక్ సుభాని అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఎనిమిది షాట్ విస్కీ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం బాటిల్స్ కలిగి ఉండటం, రవాణా చేయడం నేరమని తెలిపి అదుపులోకి తీసుకున్నారు.

మండే ఎండల్లో చల్లని జల్లులు


మార్టూరులో కురుస్తున్న వర్షం


పంగులూరులో కురుస్తున్న వర్షం

జె.పంగులూరు: ఇప్పటి వరకు తీవ్ర ఎండ, ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. అయితే ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా వాతావరణం మారిపోయింది. నల్లటి దట్టమైన మేఘాలతో భానుడు కనిపించకుండా పోయాడు. వాతవరణం పూర్తిగా చల్లబడింది. ఒక గంట పాటు ఈదురు గాలులతో, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి అరగంటసేపు ఉధృతంగా కురిసిన వర్షానికి జాతీయ రహదారికి ఇరువైపులా వర్షపు నీరు పారుతూ కనిపించాయి.

ఈ విషయమై వ్యవసాయ అధికారి అంజిరెడ్డిని వివరణ కోరగా ఇప్పటివరకు కురిసిన వర్షం మార్టూరు బొబ్బేపల్లి గ్రామాల్లో మాత్రమే కురిసిందని, ప్రస్తుతం కోత దశలో ఉన్న మొక్కజొన్న పంటకు దీనివల న ఎలాంటి నష్టం సంభవించదన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షం వలన కోలలపూడి, బొల్లాపల్లి, రాజుగారి పాలెంలో పిందె, కాయ దశలో ఉన్న మామిడి తోటలకు నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చీరాల అర్బన్: పట్టణంలో ఆదివారం ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా సాయంత్రం 5గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురుగాలులు, మెరుపులు, పిడుగులతో వర్షం కురిసింది.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోండి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు లైబ్రేరియన్ బాదం విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆదివారం శాఖ గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో దేశ నాయకులు చరిత్ర పుస్తకాలను చదివించారు.

360 మందికి కంటి వైద్య పరీక్షలు

పర్చూరు(చినగంజాం): పర్చూరులోని భవనం అంజిరెడ్డి కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా కంటి వైద్యశిబిరంలో 360 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. గుంటూరు శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాబోలు రాధాకృష్ణమూర్తి, ఇందిరాదేవీల జ్ఞాపకార్థం వారు కుమారుడు పాబోలు ఉదయభాస్కర్, గిరిజా కుమారి దంపతులు ఆర్థిక సహాయంతో నిర్వహించినట్లు తెలిపారు. రోటరీ సభ్యులు తేళ్ళ రమేష్ చంద్ర, కేఎస్ఆర్‌కే ప్రసాద్, నాగబైరు శ్రీనివాసరావు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

వాకర్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం


సత్కారం అందుకుంటున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల రూరల్: ఎస్ఆర్అండ్‌పీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సేవలు అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ శివరామ ప్రసాద్ అన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గత సంవత్సరం చీరాల వాకర్స్ సభ్యులు 27 మంది వాకర్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్టుకు రూ. 2,70,000 చెల్లించి సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్నారని అభినందించారు. ఈ సందర్భంగా 27 మంది సభ్యులను ఆయన ఘనంగా సత్కరించి మెమోంటోలు అందజేశారు. ప్రతిరోజూ ఆరోగ్యవంతంగా ఉండేందుకు వాకింగ్ సభ్యులు వాకింగ్, వ్యాయామాలు చేస్తు మరోవైపు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విరివిగా చేస్తూ ప్రజల నుంచి ప్రశంసలు పొందుతుండం విశేషమన్నారు. మాజీ గవర్నర్ పలగాని శ్రీనివాసులు రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, ఈవినింగ్ స్మార్ట్‌క్లబ్ అధ్యక్షురాలు ఇస్తర్ల సుభాషిణి, చారుగుళ్ల గురుప్రసాద్, గ్రంధి నారాయణ మూర్తి, వలివేటి మురళీకృష్ణ, గుద్దంటి రమేష్, వీరాంజనేయులు, శీరాం రమేష్, బధరీనాద్, తిరుపతిరావు పాల్గొన్నారు.